క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి మంత్రి రాజా తరఫున ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

తుని రూరల్: మండలంలోని తేటగుంట శివారు ఎర్రకోనేరులో ఇటీవల హత్యకు గురైన పప్పు సత్యవతి కుటుంబ సభ్యులకు రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆర్థిక సాయం చేశారు. బాధితులకు మంత్రి రాజా సమకూర్చిన రూ.50 వేలను శుక్రవారం ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ సకురు నాగేంద్ర నెహ్రూ సత్యవతి కుటుంబానికి అందజేశారు. బాధిత కుటుంబానికి మంత్రి దాడిశెట్టి రాజా అండగా నిలిచారని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ, సర్పంచ్ అత్తి నాగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుండుబిల్లి వెంకటరమణ, ఉపసర్పంచ్ పోతుల పెదకాపు పాల్గొన్నారు.

కంటి వైద్యుడికి సేవా పురస్కారం



నన్నయ్య వీసీ పద్మరాజు చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న అనుసూరి నాగేశ్వరరావు

ఏలేశ్వరం: ఏలేశ్వరానికి చెందిన సాయి శంకర్ నేత్రాలయ వైద్యులు డాక్టర్ అనుసూరి నాగేశ్వరరావుకు విశిష్ట సేవా పురస్కారం లభించింది. అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా పేదలకు సేవలందిస్తున్న డాక్టర్ నాగేశ్వరావును రాజమహేంద్రవరంలో ఆనంద్ రీజెన్సీలో ఇస్రో డైరెక్టర్ గోపాలకృష్ణ, నన్నయ యూనివర్సిటీ వీసీ కె.పద్మరాజు ఆధ్వర్యంలో సత్కరించి సేవా పురస్కారం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలకు ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాజమండ్రి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కె.పార్థసారథి, ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ బాలాత్రిపుర సుందరి, ప్రతిభా ఎడ్యుకేషనల్ డైరెక్టర్ మూర్తి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన యువకులు

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో శుక్రవారం యువకులు మొక్కలు నాటారు. గ్రామానికి చెందిన యువత యూనిటీ ఫర్ చేంజ్ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా గ్రామంలోని శివాలయం, దుర్గమ్మ ఆలయం వద్ద మొక్కలు నాటారు. పాదాలమ్మ గుడి వద్ద వృద్ధులకు ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ గోగుల అఖిల్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులను పలువురు అభినందించారు.

ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి

కిర్లంపూడి: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని మండల ఏఓ జోకా అమృత సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో వీఏఏలు నిర్వహిస్తున్న పంట నమోదును శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు తమ పంటలకు ఈ నెల 8వ తేదీ లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. తద్వారా పంట నష్టపరిహారం, ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు.

రక్షిత తాగునీరు అందించాలని వినతి

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరం శివారు ద్వారకా నగర్‌కు రక్షిత తాగునీరు అందించాలని ఆ ప్రాంతవాసులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి మధుశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ భూగర్భ జలాలు తాగేందుకు అనువుగా లేవని, ఇతర ప్రాంతాల నుంచి తాగునీరు తెచ్చుకోవలసి వస్తోందని వివరించారు. అధికారులు స్పందించి రక్షిత నీరు అందించాలని కోరారు. దీనిపై స్పందించిన కార్యదర్శి ప్రత్యేక అధికారికి సమస్యను తెలియజేస్తానన్నారు. దండెం రామకృష్ణ, డి.సాయి, సింహాద్రి, లోవరాజు, దేవి, విజయ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

కిర్లంపూడి: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని స్థానిక ఎస్సై పి.ఉమామహేశ్వరరావు కోరారు. మండలంలోని వేలంకలో శుక్రవారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పల్లెల్లోని చిన్న చిన్న వివాదాలను గ్రామ పెద్దల సమక్షంలోనే పరిష్కరించుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగి తమ విలువైన సమయంతో పాటు ఆర్థికంగా నష్టపోవద్దని ప్రజలకు సూచించారు. గ్రామంలో మాదకద్రవ్యాలు, సారా, గంజాయి అమ్ముతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- తుని అర్బన్ హెల్త్ సెంటర్‌లో అదనపు భవనం ప్రారంభం



తుని అర్బన్ హెల్త్ సెంటర్లో అదనపు భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రాజా, చైర్‌పర్సన్ సుధారాణి

తుని: ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని పట్టణం సీతారాంపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ అదనపు భవనాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించడంతో పాటు ఆరోగ్యం విషయంలో పలు జాగ్రత్తలను తీసుకుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు, గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రజలు చిన్న చిన్న రోగాలకు పట్టణాలకు రాకుండా ఉన్న ఊరిలోనే అధునాతన వైద్య సేవలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఇంత కంటే అభివృద్ధి ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. అసల నిజాలను ప్రజలకు తెలియకుండా టీడీపీ, జనసేన, ఎల్లో మీడియా కాకమ్మ కథలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు ఏ పథకం వలన నష్టం జరుగుతుందో స్పష్టంగా తెలియజేయాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ప్రజలకు మంచి చేస్తే మళ్లీ మరో అవకాశం ఇస్తారని, చేయకపోతే ఇంటికి పంపుతారన్న కనీస పరిజ్ఞానం టీడీపీకి లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజలకు మేం చేసింది ఇదని గర్వంగా చెప్పుకునే అవకాశాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తమకు కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. తుని మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ అన్నవరం శ్రీను, కౌన్సిలర్లు ఎస్ సుభద్రాదేవి, రేలంగి విజయదుర్గ, వాసంశెట్టి శ్రీను, మొల్లేటి పద్మ, కమిషనర్ ప్రసాదరాజు, డీఈఈ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తున్న ఇద్దరి అరెస్ట్

తుని: స్థానిక సాయినగర్‌లో ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారాన్ని ప్రోత్సహించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు తుని పట్టణ సీఐ ఎం.గీత రామకృష్ణ శుక్రవారం తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, పెద్దాపురం డీఎస్పీ కె.లతా కుమారి ఆదేశాల మేరకు సాయినగర్‌లోని ఇంటిపై దాడి చేశామన్నారు. ఇంటిని గన్నిముని సురేంద్ర కుమార్ అద్దెకు తీసుకున్నాడు. ఇతను తిప్పన నాగ సత్యనారాయణ అనే వ్యక్తితో కలిసి ఇతర ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. దాడిలో పట్టుబడిన మహిళకు కౌన్సెలింగ్ ఇచ్చి వదిలిపెట్టామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. పట్టణ పరిధిలోని లాడ్జిలు, ఇతర ప్రాంతాల్లో వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రామకృష్ణ హెచ్చరించారు.

గులాబీ రంగు పురుగుపై అప్రమత్తంగా ఉండాలి



గౌరంపేటలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ గాంధీ

శంఖవరం: పత్తి సాగు చేసిన రైతులు గులాబీ రంగు పురుగుపై అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని గౌరంపేట, జి.కొత్తపల్లి, మాసంపల్లి, జగన్నాథపురం గ్రామాల్లోని పత్తి పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంట వేసిన 45 రోజుల్లో గులాబీ రంగు పురుగు ఆశిస్తుందన్నారు. ఈ పురుగు పువ్వుల్లో పుప్పొడిని నాశనం చేయడం ద్వారా దిగుబడి తగ్గిపోతుందన్నారు. గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలను అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు సువర్ణరాజు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహణపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహణపై వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అమ్మఒడి, జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ పింఛన్ తదితర పథకాలు అర్హులందరికీ అందుతున్నాయన్నారు. మంత్రి రోజాపై టీడీపీ నాయకులు అసభ్యకర వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటు అన్నారు. మహిళల పట్ల అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ నాయకులకు ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, నీరుకొండ సత్యనారాయణ, అడపా పార్థసారధి, చిక్కాల లక్ష్మణరావు, గొల్లపల్లి కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- కామరాజుపేటలో అభివృద్ధి పనులకు శ్రీకారం



కామరాజుపేటలో రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని కామరాజుపేటలో రూ.21.5 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. స్థానిక దుర్గాకాలనీలో రూ.20 లక్షలతో చేపట్టే ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. స్థానిక దుర్గమ్మ గుడి కాలనీలో శిథిలమైన రోడ్డును బాగు చేయాలంటూ గ్రామస్తులు తన దృష్టికి తీసుకురావడంతో రూ. 20 లక్షలు సమీకరించి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, దాసరి సతీష్‌బాబు, మండల కన్వీనర్ రాంబాబు, వైస్ ఎంపీపీ మడికి మైనర్ బాబు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

తుని రూరల్: పట్టు పురుగుల పెంపకందారులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని పట్టు పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ బీఎంవీ రామరాజు సూచించారు. మండలంలోని డి.పోలవరంలో శుక్రవారం పట్టుపురుగుల పెంపకందారులు, మల్బరీ తోటల సాగు చేస్తున్న రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ రెండెకరాల్లో మల్బరీ తోట, రేరింగ్ షెడ్ నిర్మించుకుని పట్టు పురుగుల పెంపకం చేపట్టే రైతులకు రూ.8 లక్షల వరకూ రాయితీ లభిస్తుందన్నారు. రేరింగ్ షెడ్డుకు, మల్బరీ తోట పెంపకానికి రూ.10 లక్షలు ఖర్చవుతుందన్నారు. ఇందులో పట్టుపరిశ్రమ శాఖ రూ.4 లక్షలు, మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.4 లక్షలు రాయితీ లభిస్తుందని వివరించారు. కోటనందూరు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎస్.రాజు, టెక్నికల్ ఆఫీసర్ కె.లక్ష్మీనారాయణ, వీఎస్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల నిరసన

ప్రత్తిపాడు: కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీని సోషల్ మీడియాలో రావణాసురుడుగా చిత్రీకరించడానికి వ్యతిరేకంగా శుక్రవారం ప్రత్తిపాడులో ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ కళా మందిర్ వద్ద పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి సత్తిబాబు, రాంబాబు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



ఏలేరు ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజనలో భాగంగా శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో సుమారు 15 లక్షల చేప పిల్లలను స్థానిక ఏలేరు ప్రాజెక్టులో ఎమ్మెల్యే వదిలి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మత్స్యకారుల ఉపాధి నిమిత్తం ఏలేరు ప్రాజెక్టులో చేపలను పెంచుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, మత్స్యశాఖ డీఎఫ్‌ఓలు పీవీ సత్యనారాయణ, లాల్ మహమ్మద్, ఏడీ లావణ్య, ఎఫ్‌డీఓలు ఉప్పాడ శ్రీరామకృష్ణ, అనురాధదేవి, ఇన్‌స్పెక్టర్ రాజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు వర్గాల మధ్య వివాదం

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లిలో శుక్రవారం రాత్రి రెండు వర్గాల మధ్య వివాదం జరిగింది. గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన పుట్టినరోజు వేడుకల్లో ఈ వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇరువర్గాలకు చెందిన సుమారు 200 మంది స్థానిక పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని ఘర్షణ పడుతుండగా జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పారు. ఈ వివాదంలో పలువురికి గాయాలైనట్టు స్థానికులు తెలిపారు.

సారాతో ఇద్దరి అరెస్ట్

ప్రత్తిపాడు: మండల పరిధిలోని గ్రామాల్లో దాడులు చేసి 10 లీటర్ల సారాతో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. పెదశంకర్లపూడి గ్రామంలో 5 లీటర్ల సారాతో జి.దుర్గానాగేంద్రను, ఉత్తరకంచిలో మరో 5 లీటర్ల సారాతో విత్తనాల అప్పలరాజును అరెస్ట్ చేశామన్నారు. పెదశంకర్లపూడిలో సారా స్థావరాలపై దాడులు నిర్వహించి సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు హనుమంతువజ్జుల అవధాని, కోట సుబ్రహ్మణ్యం, దత్తాత్రేయ శర్మ, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ హోమం నిర్వహించారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు కంచిబట్ల సాయి ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



గొల్లలగుంటలో రోగులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



పేరవరంలో రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



హెచ్ కొత్తూరులో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు



జగన్నాథపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

గండేపల్లి: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని మురారిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రోగులను పలకరించి వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, వైస్ ఎంపీపీ కుంచె రాజా, గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, ఉప్పలపాడు, గండేపల్లి సొసైటీ అధ్యక్షులు పాము సూరిబాబు, కేతిన బాబి, యర్రంపాలెం జేసీఎస్ కన్వీనర్ నిమ్మలపూడి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో రాష్ట్రం అగ్రగామి

తుని రూరల్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. మండలంలోని హెచ్ కొత్తూరులో ఏర్పాటు శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సర్పంచ్ సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు కట్టమూరి చిన్నతో కలిసి ఆయన ప్రారంభించారు. రోగులకు ఉచితంగా మందుల కిట్లను పంపిణీ చేశారు. ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ సకురు నాగేంద్ర నెహ్రూ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దుంగల నాగేశ్వరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: మండలంలోని పేరవరంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ప్రారంభించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై డాక్టర్లను ఆరా తీశారు. తొలుత ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, వైద్యుడు పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యం

కోటనందూరు: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సర్పంచ్ లెక్కల ఉపేంద్రతో కలిసి ఆయన ప్రారంభించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరంలో..

రౌతులపూడి: మండలంలోని శృంగవరంలో శుక్రవారం ఎంపీడీఓ ఎం.గోవిందు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు గ్రామంలో 390 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 8 మందిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కంటి వెలుగులో భాగంగా 123 మందిని పరీక్షించి 102 మందికి కళ్ల జోళ్లు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు కె.హరిత, సౌందర్య, ఎం.విశ్వనాథం, వీరేంద్ర, సర్పంచ్ ఏసుబాబు, ఎంపీటీసీ రాజాబాబు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతిఒక్కరికీ మేలు

గోకవరం: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతిఒక్కరికీ మేలు జరుగుతోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని కామరాజుపేటలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న కౌంటర్లను సందర్శించారు. పలువురికి ఆరోగ్య కిట్లను అందజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, దాసరి సతీష్‌బాబు, మండల కన్వీనర్ రాంబాబు, వైస్ ఎంపీపీ మడికి మైనర్ బాబు, ఎంపీటీసీ మద్దూరు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

జగ్గంపేట: ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడుని నిజం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని గొల్లలగుంట సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, జగ్గంపేట ఎంపీడీఓ వసంత కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కిర్లంపూడి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట ట్రాన్స్ కో ఏఈ రత్నాలరావు శుక్రవారం తెలిపారు. మండలంలోని తామరాడ, రామచంద్రపురం, గోనేడ, పాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

108 వాహనంలో ప్రసవం



108 వాహనంలో జన్మించిన బిడ్డను చూపుతున్న ఈఎంటీ విద్యాసాగర్

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన గర్భిణి శుక్రవారం 108 వాహనంలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే... ఎ.కొత్తపల్లికి చెందిన వి.దుర్గాదేవికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. అన్నవరం అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ టి.విద్యాసాగర్, పైలెట్ వి.సత్యనారాయణ వెంటనే అక్కడకు చేరుకుని దుర్గాదేవిని తుని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. వైద్యుల సూచనల మేరకు అంబులెన్స్ సిబ్బంది పురుడు పోశారు. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని ఈఎంటీ విద్యాసాగర్ తెలిపారు. అనంతరం వైద్యం కోసం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు.